# సర్వగురు నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతీ!

## - గురు ఆరాధనమనేది ప్రతీ మతంలోనూ ఉన్నది! -

## - ఆయా వారి ఆరాధనలు వారికి మాత్రమే చెందుతాయ్! -





**భా**రతదేశంలో ఎవరు ఏ గురువునైనా, భగవంతునినైనా భక్తితో నమస్కరించినపుడు అది కేశవుని (కృష్ణుని)కే చెందుతుంది!!

భగవంతుడే గురువు, ఆయన మనుష్యరూపం ధరించినపుడు, ఆయనా మానవమాత్రుడై గురు శుశ్రూష చేసినట్టు శ్రీరామ, శ్రీకృష్ణ అవతార చరితలే ప్రత్యక్ష నిదర్శనములు. పరమాత్మగానీ, పరమగురుడు గాని ఆకాశమువలె విభజించుటకు వీలుకాని పరిపూర్ణులు. భగవంతుని విశ్వరూప చిత్రమును చూచినపుడు మనం కొలిచే భగవద్ముఖ బింబములన్నీ కనిపిస్తాయ్. ఆయన గీతలోనే చెప్పారు. తాను ఒకే పరిపూర్ణ రూపుడై యున్ననూ సమస్త చరాచర ప్రాణుల్లోనూ వేర్వేరు రూపములుగా గోచరించుచుందును అంటూ, సృష్టికర్తయైన బ్రహ్మ, పోషకుడైన విష్ణువు, లయకారకుడైన రుద్రుడే ఆయనే!

జగద్గురు శంకరభగవత్పాదుల శిష్యులైన తోటకాచార్యులు ఆదిశంకరులను స్తుతిస్తూ

**భవ ఏవ భవాని తిమే నితరాం**
**సమజాయత చేతసి కౌతుకితా**
**మయవారయ మోహమహా జలధిం**
**భవశంకర! దేశిక! మే శరణమ్။**

నీవే పరమేశ్వరుడవని నా మనస్సునందేర్పడినది. నా యొక్క అజ్ఞాన మనెడి మహాసముద్రమును నివారింపుము. ఆచార్యా! శంకరా! నాకు రక్షకుడవగుము. -అంటారు.

గురుస్వరూపం అందరు గురువుల్లోనూ ఉన్నది. ప్రధానంగా ఆదిగురువుగా వేదవ్యాసులవారినే పేర్కొనాలి భగవద్గీతలో.

**పార్థాయ ప్రతిబోధితాం భగవతా**
**నారాయణేవ స్వయం వ్యాసేన గ్రంథితాం**
**పురాణమునినా మధ్యే మహాభారతం**- అని ఉన్నది.

కురుక్షేత్ర సంగ్రామ సందర్భంలో నారాయణుడైన శ్రీకృష్ణుడు అర్జునునికి బోధిస్తుండగా, మధ్యలో గ్రహించి గ్రంథస్తం చేసిన మహాముని వ్యాసమునే! ఆయన జ్ఞానపురుషుడు. దివ్యశక్తి సంపన్నుడు. అజ్ఞాన తిమిరాన్ని పోగొట్టి జ్ఞానమనే వెలుగును ప్రసాదించిన వేద వ్యాసునికి ముందుగా నమస్కరించాలి.

**తమసోమా జ్యోతిర్గమయ**
**అసతోమా సద్గమయ**
**మృత్యుర్మో అమృతంగమయ**

నన్ను అంధకారం నుంచీ వెలుగులోకి నడిపించు, అసత్యం నుంచీ సత్యం వైపు నడిపించు- అని ప్రార్థించదగిన గురువు వ్యాసులు వారొక్కరే! ఆయనే పరమాత్మ ప్రసాదించిన వేదాలను విభజన చేసి ప్రజల కందించి, ప్రజల్లో ఆధ్యాత్మిక భావం కల్పించినవాడు మహాభారతం వంటి గ్రంథాన్నే గాకుండా అష్టాదశ పురాణాలను వ్రాసి భారతదేశానికి చరిత్ర, విజ్ఞానం కల్పించినవాడు.

**'వ్యాసాయా విష్ణురూపాయ నమః'** వ్యాసుడే విష్ణువు నారాయణుడు.



**ఓం నారాయణం పద్మభువం వశిష్టం**
**శక్తించ తత్పుత్ర పరాశంచ**
**వ్యాసం, శుకం, గౌడపదం మహాంతం**
**గోవింద యోగీంద్ర మధాస్య శిష్యయే။**
**శ్రీశంకరాచార్య మధాస్స**
**పద్మపాదాంచ హస్తామల కంచ శిష్యం**
**తంత్రోటకం వార్తిక కారమన్యాన్**
**అస్మద్గురూన్ సంతత మానతోస్మి**

-అంటూ గురుపరంపరకు వందన శతములర్పిద్దాం. వ్యాసపూర్ణిమ రోజున వీరందర్ని తలచుకోవడంతో వర్తమానంలోని గురువులను పీఠాధీశులనూ స్మరించుకుంటూ అస్మద్గురూనే సంతతమానతోస్మి అంటూ తరించ నుద్దేశించడమే గురుపూజా విశిష్టత.

గీతాబోధనం చేసిన ఆదిగురువుతో సముడు వ్యాసుడు.

దత్త సాంప్రదాయంలో ఆది గురుడు శ్రీదత్తాత్రేయస్వామి. ఆ పరంపరలోని సద్గురువరేణ్యుడు షిర్డీ సాయినాధుడు. ప్రపంచమంతటా షిర్డీసాయినాధుని భక్తులు కోట్ల సంఖ్యలో ఉన్నారు. సాయిమందిరాలు లక్షల్లో ఉన్నాయ్.

నిన్న మొన్నటిదాకా మన మధ్య ప్రత్యక్షదైవంగా విలసిల్లి, విశ్వమంతటా 'భగవాన్ సత్యసాయి'గా కీర్తింపబడుతున్న పుట్టపర్తి భగవానునికి పుడమిలోని అన్ని దేశాల్లోనూ ప్రార్థనామందిరములన్నాయ్. ఆయన మహిమలన్ని చెప్పడానికి నా వయసు చాలదు. ఆయన భక్తులున్న దేశాల్ను పేర్కొనడానికి నా విజ్ఞత చాలదు. వారు సమాధి పొందిన అనన్తరము కూడా అనేక మహిమలు చెబుతున్నారు. శ్రీపాదవల్లభుల అనన్తరం భగవాన్ సాయి తెలుగుదేశంలో పుట్టడం, నడయాడడం తెలుగువారు చేసుకున్న అదృష్టం. ●

